# నేహాల



సాయిబ్రహ్మానందం గొర్తి

# చరిత్రకి బలైన స్వేచ్ఛ కథ

(గత సంచిక నుంచీ తరువాయి)

## 13

**ఇంటికొస్తూనే తల్లికి గురువుగారింట్లో** విషయం పూస గుచ్చినట్లు చెప్పింది నేహల. జరిగినదంతా చెబుతూంటే హరేంద్ర కూతురి ముఖంలో ఆనందం చూస్తున్నాడు.

"అమ్మా! ఈనాడు నాకెంతో సంతోషంగా ఉంది. అప్పా! నీలాంటి తండ్రి దొరకడం నా అదృష్టం. పెళ్ళి చేసి అత్తారింటికి పంపడంలోనే తల్లితండ్రుల ధ్యాసుంటుంది. అలాంటిది నా మీద మమకారంతో నువ్వు మహారాజుని కూడా లెక్క చెయ్యలేదు. అప్పా! మనం గ్రహించం కానీ, ఈ జీవితం చాలా చిన్నది. మనం పెద్ద పెద్ద గమ్యాలు చేరుకోడంలో చిన్న చిన్న ఆనందాలూ, కోరికలూ పక్కన పెట్టేస్తాం. తీరా అనుకున్నది సాధించాకా కోల్పోయినవి వెనక్కి తిరిగి తీసుకురాలేం. నా వరకూ ఈ ఇంట ఆడుతూ పాడుతూ మీ మధ్య గడపడంలో ఉన్న స్వేచ్ఛ, సుఖం, సంతోషం దేనికీ సరికాదు. నాకేమీ పెద్ద పెద్ద కోరికలు లేవు. ఈ చిన్ని చిన్ని ఆనందాలు చాలు." కళ్ళనీళ్ళ పర్యంతమవుతూ అంది.

కూతురి మనసు తెలుసు హరీంద్రకి. ఆమె చెప్పినది మెల్లమెల్లగా అర్థమవుతోంది. అర్థమయినా కాకపోయినా కూతురు మనసు కష్ట పెట్టలేడు. ఆమె ఆనందమే అతనికి ముఖ్యం.

"మరి మహారాజు ఆగ్రహిస్తే?" సందేహం వెలిబుచ్చింది నేహల తల్లి.

"లేదమ్మా! రాజుగారికి నాలాంటి వాళ్ళు ఎంతమందైనా దొరుకుతారు. గురువుగారు ఏదో మనమీద అభిమానం కొద్దీ ఎంతో గొప్పగా చెప్పేసరికి మహారాజు నిజమేనని భ్రమించి తొందరపాటుగా ఇలా ఆహ్వానం పంపించుంటారు. గురువుగారు సర్ది చెబుతారులే! అన్నిటికీ అశ్వత్థ నారాయణుడే ఉన్నాడు." నేహల తల్లికి ధైర్యం చెప్పింది.

"నేహలా! తల్లీ! నిన్నో ప్రశ్నడగచ్చా?" మెల్లగా అన్నాడు హరీంద్ర.

ఆశ్చర్యపోయింది నేహల. "అడగచ్చా ఏమిటి అప్పా! అడగండి. మీరేం అడగబోతున్నారో నాకు తెలుసు! అసలు పెళ్ళికి నేనంటూ సుముఖమేనాని కదూ?"

తలెత్తకుండానే అవున్నట్లు తలూపాడు. రేవన్న విషయం చెప్పాలా వద్దాన్న సంశయంలో పడిపోయింది నేహల. చెబితే తండ్రి ఏమంటాడో? అయినా ఇది సమయం కాదు. నిన్నటి నుండి మనస్థిమితం లేదు. అలాంటప్పుడు చెప్పడం అంత శ్రేయస్కరం కాదని అనుకుంది.

"అప్పా! తప్పకుండా చేసుకుంటాను. అశ్వత్థ నారాయణుడి మీద ఆన!"

తలెత్తి చూసాడు. తెలీని దుఃఖం. మెల్లగా లేచి కూతుర్ని దగ్గరకున్నాడు హరీంద్ర.

మాట లేదు. నేహలదీ అదే పరిస్థితి.

తుఫాను వెలిసిన నిశ్శబ్దంలా ఉందక్కడ.

ఎన్నడూ ఏ విషయంలోనూ మనస్తాపానికి గురికాలేదు కుటుంబంలో ఎవరూ!

ఇవాళ గడిచింది. రేపు ఏమిటన్నది ఎవరికీ తెలీదు.

*0000000000*

నేహలని దేవరాయలు పెళ్ళి చేసుకుంటాడన్న వార్త ముద్గల్లో గుప్పుమంది. అందరి నోటా నిన్నటి వరకూ అదే చర్చ. నేహల నిర్ణయం ఇంకా ఎవరికీ తెలీదు.

వేదరాయశర్మ శిష్యులకీ పూర్తి వివరాలు తెలీవు. ఉదయాన్నే హరీంద్రా, నేహలా వేదరాయశర్మ ఇంటికి వెళ్ళినట్లుగా తెలుసు కానీ ఏం జరిగిందీ ఎవరికీ తెలీదు. పెళ్ళి మాటలకోసమే వచ్చారని అందరూ అనుకున్నారు.

వేదరాయశర్మ శిష్యులకి ఉన్న పళాన రమ్మనమని కబురంపించాడు. ముఖ్యంగా రేవన్నకీ, శంభుడికీ. రేవన్న ఊరినుండి ఇంకా రాలేదు. శంభుడు హుటాహుటిన వచ్చాడు. ఏం జరిగిందీ కుప్తంగా తెలిసింది.

నేహల మహారాజుని కాదన్న విషయం చూసి ఆశ్చర్యపోయాడు. ఇలా జరుగుతుందని తన ఊహక్కూడా అందలేదు. ఈ వివాహం ద్వారా నేహలా,రేవన్నలకి ఒక గుణపాఠం చెప్పినవుతుందని భావించాడు.

రేవన్న ప్రలోభం వల్లే నేహల అంత ధైర్యంగా చెప్పిందని అనుకున్నాడు. ఇదే సంగతి పైకి అందామనుకొని అనవసరంగా ఎందుకొచ్చిన గొడవని ఆగిపోయాడు. గురువుగారి చెదిరిపోయినట్లుగా కనిపించాడు.

అందుకే పైకి ఏమీ అనలేదు.  తెలివిగా రేవన్న గురించి వాకబు చేసాడు.

"రేవన్నగానీ ఇటొచ్చాడా గురువుగారూ?" అని అడిగాడు.

రేవన్న పొలం పనులమీద రాయచూరు వెళ్ళాడనీ, సాయంత్రానిక్కానీ, రేపటిక్కానీ రావచ్చని కబురు తెలిసిందని చెప్పాడు వేదరాయశర్మ.

రేవన్న ఊళ్ళో లేడన్న విషయం శంభుడికి భయం కలిగించింది. నేహల నిర్ణయం తెలిసీ మొత్తం వివరాలన్నీ కూపీ లాగితే తనని రేవన్న ఒదిలిపెట్టడు. గురువుగారున్నారన్న ధైర్యం ఉన్నా లోలోపల భయం వెన్నాడుతూనే ఉంది.

"ఈ మధ్యాన్నానికి విజయనగరం వెళ్ళాలి. రేవన్న లేడు. నువ్వే నా తోడుగా రావాలి. ఇంటికెళ్ళి సిద్ధంకా!" వేదరాయశర్మ - ఆదేశించాడు.

ఊళ్ళో ఉండడం కన్నా గురువుగారి వెంట వెళ్ళడమే క్షేమమని 'సరేనంటూ' ఇంటి ముఖం పట్టాడు.

వేదరాయశర్మ విజయనగర ప్రయాణానికి సన్నిద్ధుడయ్యాడు. మహారాజుకి ఏం చెప్పాలా, ఎలా చెప్పాలాన్నదే అతని ఆలోచన.

"మీరనవసరంగా ఆవేశపడకండి. నింపాదిగా జరిగింది మహారాజుకి చెప్పండి. మహారాజుకి ఆగ్రహం వస్తే మనకీ, ఎవరికీ మంచిది కాదు. నేహల కాదని చెప్పడం కన్నా ఏదో ఒక సంబంధం కుదుర్చుకున్నారనో, బంధువులకి మాటిచ్చారనో ఏదో ఒకటి సర్ది చెప్పండి. అటొచ్చీ ఇటొచ్చీ మీమీద పడుతుందేమోనని నా బాధ!" బయల్దేరుతుండగా వేదరాయశర్మ భార్య సుభద్రందది.

సుభద్ర చెప్పింది విని అలాగే అన్నాడు వేదరాయశర్మ. ఏం చెప్పాలా అన్నది ప్రయాణంలో ఆలోచించవచ్చని అనుకున్నాడు. ఇంతలా ప్రయాణాలు చేసే వయసుకాదిది. ఓపిక లేకున్నా మహారాజుకోసం బయల్దేరడం తప్పలేదతనికి.

త్వరగా భోజనాలు ముగించుకొని భగవంతుడి మీదే భారం వేసి విజయనగరం బయల్దేరాడు.

చీకటి పడ్డాక గురువుగారు కబురంపారని తెలిసి అప్పుడే ఊరినుండొచ్చిన రేవన్న వేదరాయశర్మింటికి బయల్దేరాడు. రేవన్న తల్లి ద్వారా మహారాజు నేహలని పెళ్ళి చేసుకుంటాడన్న విషయం తెలిసి హుతాశుడయ్యాడు. తల్లి ఎదుట పైకేమీ అనలేదు. గురువుగారి ద్వారానే జరిగింది తెలుసుకోవడం మంచిదన్న నిర్ణయానికొచ్చాడు. వాళ్ళూ వీళ్ళూ చెప్పగానే తల్లికి తెలిసుంటుంది తప్ప నిజానిజాలు తెలీవు.

గురువుగారింటికి హుటాహుటిన బయల్దేరాడు. వెళ్ళేసరికి గురువుగారి భార్య సుభద్రకి తోడుగా అక్కడ ప్రభా, ఇంకా కొంతమంది శిష్యులూ ఉన్నారు.

అక్కడికెళ్ళాక విషయం తెలిసింది. సుభద్ర జరిగినదంతా పూస గుచ్చినట్లు చెప్పింది.

ఆవిడ చెబుతున్నంత సేపూ శ్రద్ధగా, నింపాదిగా విన్నాడు. మనసులో ఉన్న ఉద్రికతతని పైకి కనిపించనివ్వలేదు.

నేహల నిర్ణయం విని మనసులోనే అభినందించాడు. మనసు కాస్త తెరిపిన పడింది.

గురువుగారు ఈ మధ్యాన్నమే విజయనగరం తిరిగి ప్రయాణమయ్యారని తెలుసుకున్నాడు.

"మీ రెవరైనా నేహలతో మాట్లాడారా?" అని ప్రశ్నించాడు. లేదన్నట్లుగా చెప్పారందరూ!

ఆ రాత్రే వెళ్ళి కలుద్దామా అనుకున్నాడు. ఈ పరిస్థితుల్లో వెళ్ళడం మంచిది కాదనుకున్నాడు.

ఉదయమే నేహలని కలిసి ఆమె వైపు ఆలోచన కూడా వినాలనిపించింది.

ఒకవైపు ఆనందమూ, మరో వైపు భయమూ కలిగాయి రేవన్నకి.

పరిపరి విధాలా ఆలోచిస్తూ ఇంటి ముఖం పట్టాడు.

*000000000000000000*

ఆ మర్నాడు రేవన్నా, ప్రభా ఇంకా కొంతమంది స్నేషితులు నేహల ఇంటికి వెళ్ళారు.

రేవన్నని చూడగానే నేహల కళ్ళల్లో మెరుపు కనిపించింది. జరిగిన దంతా పూస గుచ్చినట్లు చెప్పింది.

"నీకో విషయం తెలుసా నేహలా? నీ చిత్ర పటాన్ని శంభుడు గీసి మహారాజుకి చూపించాడట. అంతవరకూ మహారాజుకి అందరూ చెప్పినదే కానీ నువ్వెలా ఉంటావో తెలీదు. అసలీ పెళ్ళి ఆహ్వానం ఏమిటో బుర్ర బద్దలు కొట్టుకున్నా అర్థం కాలేదు." ప్రభ అంది.

శంభుడి పేరు వినగానే నేహల ఆశ్చర్యపోయింది. "నా చిత్ర పటం గీసిచ్చాడా? ఎందుకు?"

"ఎందుకో పూర్తి వివరాలు తెలీదు. ఇది కూడా నాకు గురువుగారి భార్య చెబితే తెలిసింది. అయినా మహారాజుకీ నీకు ఎంతో వయసు భేదముంది..."

"ఏముందీ? సంపదా, రాజ్యమూ, అధికారమూ చేతిలో ఉన్నాయి. ఏం కావలంటే అది దొరుకుతుందన్న అహంకారం! ఏదైనా పొందగలమన్న దురహంకారం! నాతో పని లేదు. ఆయన ఇష్టపడ్డారు కనుక నేను సరే ననాలి. ఎందుకంటే ఆయన మహారాజు. నేను మూమూలు మనిషిని కాబట్టి.." నేహల గట్టిగా అంది.

"గురువుగారూ దీన్ని సమర్థించారంటే నమ్మశక్యంగా లేదు. నీకూ మహారాజుకీ పాతికేళ్ళ పైగా వయసు భేదముంది." రేవన్న అన్నాడు.

"ఇందులో ఆశ్చర్యమేముంది? కొత్త పట్టపురాణి వయసు నా కంటే రెండు మూడేళ్ళెక్కువ. అసలీ పెళ్ళి ఆలోచన గురువుగారిదేనన్న అనుమానం నాకుంది. విషయం తెలిసాకా ఆయనమీద చాలా కోపం వచ్చింది. పుట్టి బుద్ధెరిగి మా ఇంట్లో ఇంతగా కలత చెందినది లేదు." నేహల బాధగా అంది.

"ఈ శంభుడు కూడా గురువ్‌గారికి తోడెళ్ళాడట. అయినా వాడికెందుకు నీమీద అంత కక్ష!" ప్రభ అంది.

నేహల గతంలో శంభుడితో జరిగిన చిన్న వివాదం సంగతి చెప్పింది.

"అందుకే! నీ చిత్ర పటం వేసి ఇచ్చుంటాడు." ప్రభకి శంభుడి మీద కోపంగా వుంది.

"ఒక్క విషయం నేహాలా! నీ ధైర్యానికి మెచ్చుకోవాలి. ఇంటికొచ్చిన సిరినీ, వైభవాన్నీ వెనక్కి నెట్టేసావనీ ఊరంతా అనుకుంటున్నారు. నీలా వాళ్ళు ఆలోచించడం లేదు. నీ మనసెవరికీ అర్థం కాలేదు."

"ముందు మా అప్పా నన్నొక బుద్ధితక్కువదానిలా అనుకున్నాడు. వివరంగా అంతా చెప్పాక విషయం అర్థమయ్యింది. రాణివాసమొక పంజరం. అందులో నేను ఇమడలేను. ప్రభా వాళ్ళ చుట్టాలమ్మాయి రాచకుటుంబంలో వ్యక్తినే చేసుకొని ఏమయ్యింది? చివరకి మందిరం పైనుండి దూకి త్మహత్య చేసుకుంది. బయటకు కనిపించే మెరుపులేకానీ అదొక అగ్నిగుండం. అందులో అడుగిడితే మసి బారిపోతారెవరైనా! నన్నూ నా వ్యక్తిత్వాన్నీ గౌరవించని వ్యక్తి దేముడైనా నాకక్కర్లేదు. సౌకర్యాలు సుఖాన్నిస్తాయేమో కానీ స్వేచ్ఛకి మించిన ఆనందం లేదు నా దృష్టిలో!"

అందరికంటే భిన్నంగా ఉన్న నేహాల మనస్తత్వాన్ని మెచ్చుకున్నారు స్నేహితులు.

"మరి గురువుగారు మహారాజుకేమి ఎలా నచ్చచెబుతారు? ప్రభా నేకేమయినా తెలుసా?" రేవన్న అడిగాడు.

"తెలీదు. ఏదో ఒకటి సర్ది చెబుతారన్న నమ్మకం నాకుంది. మరీ శంభుడు నోరిప్పితే తప్ప! " ప్రభ అంది.

"ముద్గల్లో అడుగు పెట్టనీ వాడి సంగతి చెబుతాను." పళ్ళు పటపటా కొరుకుతూ అన్నాడు రేవన్న.

"రేవన్నా! అనవసరంగా గొడవలెందుకు? గురువుగారు తిరిగొచ్చాకా మామూలుగా ఉందాం. ఏదో చిన్న విషయానికి మనం తగాదా పడడం నాకిష్టం లేదు. జరిగింది మర్చిపోదాం. నువ్వు శంభుణ్ణి ఏమీ చెయ్యద్దు. నా మీద ఒట్టే!" నేహాల రేవన్నని చెయ్యి తీసి తన నెత్తి మీద పెట్టుకుంది.

రేవన్న హుతాశుడయ్యాడు.

"నీకేమయినా మతిపోయిందా? వాడు నీ జీవితాన్ని నాశనం చెయ్యబోతే..నువ్విలా...?"

"రేవన్నా! ఇందులో శంభుడి పాత్రుందని నేననుకోవడం లేదు. గురువుగారూ, మహారాజూ ఏం చెబితే అది చేసుంటాడు. అతని పరిస్థితుల్లో నువ్వున్నా అదే చేస్తావు. నా వల్ల మీరందరూ గొడవపడడం నాకిష్టం లేదు. అందరం సంతోషంగా ఉందాం."

నేహాల తన మనసులో మాట చెప్పింది.

ఆమె క్షమా గుణం చూసి స్నేహితులందరూ అభినందించారు. కొంతసేపు కబుర్లు చెప్పుకున్నాక వాళ్ళందరూ అక్కడ నుండి నిష్క్రమించారు.

ఏమీ భయం అవసరం లేదనీ, ఎప్పుడైనా తనకి కబురు పంపమనీ చెప్పాడు రేవన్న. అంత మాట్లాడుకున్నారు కానీ ఎవరూ రేవన్నా, నేహాల ప్రేమ గురించి ప్రస్తావనే తీసుకురాలేదు.

*000000000000000000*

వేదరాయశర్మ విజయనగరం చేరుకోడానికి మూడునాళ్ళు పట్టింది. రాజధానిలో అడుగిడుతూనే మహారాజుకి తనొచ్చినట్లుగా వర్తమానం పంపాడు. ఆనాడు సాయంత్రం విజయనగరంలో తనెప్పుడూ ఉండే విడిదిలోనే బస చేసాడు. ముద్గల్లో ఏం జరిగిందీ ఎవరికీ చెప్పవద్దనీ, తనే స్వయంగా మాహారాజుకి విన్నవిస్తానని తనతో వచ్చిన అధికారులని ఆదేశించాడు. శంభుడి సంగతి సరేసరి. మొత్తం ప్రయాణంలో నోరు విప్పితే ఒట్టు. ఏం జరుగుతుందాన్న భయం ఒక పక్కనా, ఆతుత మరో పక్కనా అతన్ని పీడిస్తున్నాయి. వేదరాయశర్మ పరిస్థితి కూడా అంతే! కానీ వయసు నేర్పిన అనుభవమ్మీద అతను ఎంతో సమ్యమనం పాటించాడు.

వేదరాయశర్మ వచ్చిన సంగతి నరేంద్రగజపతికి చేరింది. విషయం తెలియలేదు కానీ వేదరాయశర్మ రాక సంబంధించిన వార్త మాత్రం తెలిసింది. వేదరాయశర్మున్న విడిదికి వెళ్ళి విషయం కనుక్కుందామా అనుకున్నాడు. కానీ ఆయనొక్కడే తిరిగి వచ్చాడనీ, అతనివెంట ఎవరూ రాలేదని తెలిసి ముద్గల్ అమ్మాయికి వేరే పెళ్ళయినా అయ్యుండాలి, లేదా వీలుచూసుకొని మంచి ముహూర్తం

చూసుకుని బయల్దేరైనా వుండాలని అనుకున్నాడు. ముందుగా తనెళ్ళి విషయం కనుక్కుంటే మహారాజుకి తెలిస్తే గొడవవుతుంది. ఎట్టిపరిస్థితుల్లోనూ దేవరాయలకి అనుమానం రాకూడదు. అందుకని వేదరాయశర్మని కలిసే ఆలోచన విరమించుకున్నాడు. మర్నాడు మహారాజుని వెన్నంటి వుంటే విషయం అదే తెలుస్తుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ తను పైకి తేలకూడదు. ఈలోగా అక్క ఉమాదేవికి ఈ వార్త చెవిన వేసి ఆమె ద్వారా కూడా కొంత సమాచారం సంపాదించవచ్చు. మహారాజుని అడిగ్గల చనువూ, అధికారమూ ఉన్నాయామెకు.

హుటాహుటాన ఉమాదేవి మందిరానికి పయనమయ్యాడు నరేంద్ర గజపతి.

జాము గడిస్తే కానీ మహారాజు వచ్చే అవకాశం లేదు. ఈ లోగానే ఉమాదేవిని కలిసి విషయం చేరవేయడం ముఖ్యం. ఒకవేళ మహారాజు రాత్రికి వస్తే ఆమె తెలివిగా విషయం రాబట్టగలదు. దాన్ని బట్టి తమ వ్యూహం ఆలోచించుకోవచ్చనీ అనుకున్నాడు.

అప్పుడే రాత్రి భోజనం ముగించి తన మందిరంలో ఉందని తెలుసుకున్నాడు. వడివడిగా ఆమె మందిరాన్ని చేరుకున్నాడు. తమ్ముడి ఆకస్మిక రాకలో కంగారు చూసి ఏం జరిగిందానుకుంది ఉమాదేవి. వస్తూనే మందిర ద్వారం మూసాడు నరేంద్ర గజపతి.

"ఏం జరిగింది తమ్ముడూ! ఏమయ్యింది?" ఆతృతగా అడిగింది.

"అక్కా! ఇప్పుడే వేగులొక వార్త పట్టుకొచ్చారు. ఈ సాయంత్రమే ముద్గల్నుండి ముసలి గురువు అదే వేదరాయశర్మ వచ్చాడట. కలిసి విషయం తెలుసుకుందామనుకున్నాను. కానీ మహారాజుకి అనుమానమొస్తుందని వెళ్ళలేదు. ఈ విషయం నీకు చెబుదామని వచ్చాను. మహారాజు కానీ ఇటు వస్తే వివరాలు సేకరించు!" జరిగినదంతా చెప్పాడు.

"ఆ అమ్మాయికూడా వచ్చిందా?" ఉమాదేవి ప్రశ్నించింది.

"లేదు! ఆయనొక్కడే వచ్చాడట. ఏం జరిగిందీ ఎవరికీ తెలీదు. మహారాజుని నువ్వొక కంట కనిపెట్టు. నేనూ రేపుదయం పనున్నాలేకున్నా ఏదో వంక పెట్టుకుని మహారాజు మందిరానికి వెళతాను. మనవాళ్ళనీ వివరాలు తెలుసుకోమని చెప్పాను."

ఉమాదేవి ఆలోచనలో పడిపోయింది. ఆ అమ్మాయితో పెళ్ళి జరిగితే తన స్థానం కోల్పోతుంది. ఏం చెయ్యాలో పాలుపోవడం లేదామెకు. అదే తమ్ముడితో అంది.

"కంగారు పడద్దు! ఆ అమ్మాయి రాలేదంటే ఏదో జరగకూడనిదే జరిగుండచ్చు. ఆ అమ్మాయికి పెళ్ళయిపోయుండచ్చు."

"అంత తొందరగానా? ముసలాడి శిష్యురాలంటున్నావు. ఆయనకి తెలీకుండా పెళ్ళి జరుగుతుందా?"

"నిజమే! రేపటి ఉదయం వరకూ వేచి చూద్దాం! మహారాజు వస్తే మాత్రం నువ్వు తెలివిగా ప్రవర్తించు." అంటూ హెచ్చరించాడు.

కొంతసేపు తామేం చెయ్యాలీ అన్నది పలు కోణాల్లో ఆలోచించారు. ఏం చెయ్యాలీ అన్నది మాత్రం అసలు విషయం బట్టే ఉంటుంది.

అక్కగారికి జాగ్రత్తలూ అవీ చెప్పి సెలవు తీసుకున్నాడు నరేంద్ర గజపతి.

బయటకు వస్తూ అక్కడున్న అధికారులని మహారాజు ఎక్కడ ఉన్నారని వాకబు చేసాడు. వారికి తెలీదని సమాధానం చెప్పారు.

*000000000000000*

వేదరాయశర్మ విజయనగరం వచ్చిన వార్త తెలిసి వేంటనే తన ఆంతరంగిక మందిరానికి రమ్మనమని కబురంపాడు దేవరాయలు. ఒక రధాన్నిచ్చి వేంటనే తోడ్కొని రమ్మనమని చెప్పాడు.

మహారాజు ఆజ్ఞను కాదనలేక వేదరాయశర్మొక్కడే బయల్దేరాడు. శంభుడు రావాలాని అడిగినా అవసరం లేదని మహారాజుని కలిసి వచ్చేస్తాననీ, సేవకులు తోడున్నారు కాబట్టి అవసరం లేదని చెప్పాడు. శంభుడు కాస్త నిరాశ చెందాడు. మహారాజు వద్ద వేదరాయశర్మ ఏం చెబుతాడా, మహారాజు ఎలా స్పందిస్తాడాన్న ఉత్సుకత అతన్ని రెండునాళ్ళుగా దొలిచి వేస్తోంది. గురువుగారి మాటలు కాదనలేక ఊరుకున్నాడు.

వేదరాయశర్మ మహారాజు ఆంతరంగిక మందిరం చేరుకోగానే దేవరాయలు ఎదురెళ్ళి లోపలకి తీసుకెళ్ళాడు. అతని మొహంలో ఆత్రుత కొట్టచ్చినట్లు కనిపిస్తోంది.

"రండి గురువర్యా! ఏ శుభవార్త తీసుకొచ్చారు? ఆ అమ్మాయి నేహలని ఎప్పుడు చూస్తానాని మనసెంతో ఉవ్విళ్ళూరుతోంది. మీతో వచ్చిన అధికారుకల చేత అంగీకారం తెలపితే చాలని చెప్పానుగా? మీరు నాకోసం ప్రత్యేకంగా మరలా తిరిగి రావాలా?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించాడు.

వేదరాయశర్మకెలా మొదలుపెట్టాలో తెలియలేదు.

"మహారాజా! క్షమించండి.." అంటూ తడబడ్డాడు.

"క్షమించడమేవిటి? గురువర్యా? ఏం జరిగింది?" మహారాజు మొహంలో రంగులు మారాయి.

వేదరాయశర్మ జరిగిన విషయం సావధానంగా చెప్పాడు. ఓపిగ్గా విన్నాడు మహారాజు. పూర్తిగా విని హుతాశుడయ్యాడు. ఒక సాధారణ స్త్రీ తిరస్కారం అతనిలో కోపాన్ని రగిలించింది.

"ఎంత పొగరు? మహారాజులమైన మా ఆహ్వానాన్నే కాదంటుందా? ఎంత ధైర్యం? అయినా ఆ అమ్మాయి సరే దాని నాన్న ఏమయ్యాడు? మహారాజుతో వ్యవహారమనీ చెప్పారా?" అగ్గిమీద గుగ్గిలమయ్యాడు దేవరాయలు.

ఇన్నాళ్ళూ తను కావాలనుకున్న స్త్రీని పొందాడు. మరింత నచ్చిన స్త్రీలని రాణుల్ని చేసుకున్నాడు. ఇంతవరకూ తనకి వ్యతిరేకంగా చెప్పిన వారెవరూ తారసపడలేదు.

అందుకే ఉవ్వెత్తున లేచాడు.

"మహారాజా! ఆవేశపడకండి. మీకు ఆ అమ్మాయి సంగతి చూచాయగా చెప్పాను. మా బృందమంతా నాట్య ప్రదర్శనకి వచ్చారు కానీ నేహలొక్కతీ రాలేదు. అందరిలాంటి అమ్మాయీ కాదు. అయినా మీరు తలుచుకుంటే ఆమెకంటే అందగత్తెలని వివాహమాడగలరు. ఏదో చిన్న పిల్ల! వదిలేయండి.." వేదరాయశర్మ వేడుకున్నాడు.

"ఆ అమ్మాయి పేరేమిటన్నారు..నేహలా! ఎంత కండకావరం? మా ఆహ్వానం ఎందుకు వద్దందో చెప్పిందా? కారణం మాకు సవివరంగా తెలియాలి."

మహారాజు ఆవేశం చూసి కంగారు పడ్డాడు వేదరాయశర్మ. ఇటువంటి పరిస్థితుల్లో శాంతంగానే ఉండాలని నిశ్చయించుకుని మెల్లగా సర్ది చెప్పడం మొదలుపెట్టాడు.

"అమ్మాయి తల్లి తండ్రులని విడిచి ఉండలేదట. పైగా ముద్గల్ విడిచి ఈ విజయనగరంలో ఉండడం కష్టమని భావించింది." మెల్లగా అన్నాడు.

"తల్లి తండ్రులని వదిలి ఉండలేదా? ఏం రేప్పొద్దున్న వేరొకర్ని వివాహమాడినా భర్త దగ్గరకే వెళ్ళాలి కదా? గురువర్యా? మీరేదో దాస్తున్నారు." దేవరాయలు వేదరాయశర్మ వైపు అనుమానంగా చూసాడు.

ఇక మహారాజు వద్ద దాచి ప్రయోజనం లేదనీ జరిగింది జరిగినట్లు చెప్పాడు.

మహారాజు శ్రద్ధగా విన్నా అతని మొహంలో కోపజ్వాలల ఎర్రదనం గమనిస్తూనే ఉన్నాడు వేదరాయశర్మ.

"నేహలా! నీకు కావల్సింది స్వేఛ్ఛే కదా? నిన్ను బంధించి కారాగారంలో పడేస్తాను. జీవితంలో వెలుగు లేకుండా చేస్తాను." పళ్ళు పటపటా కొరుకుతూ అన్నాడు.

"మహారాజా! శాంతించండి. మీరు తలుచుకుంటే ఏదైనా చెయ్యగల సమర్థులు. కానీ ఆ అమ్మాయి చిన్న పిల్ల. ప్రపంచం పూర్తిగా తెలీదు. దయచేసి నా మీద గౌరవంతోనయినా మీరు ఆ అమ్మాయిని మర్చిపోండి. దీనికంతటికీ ఒకరకంగా నేనే కారణం కూడా! మీకు నేను చెబితేనే కదా నేహల గురించి తెలిసింది...రేపు ఉదయం వస్తాను. తీరుబడిగా ఆలోచిద్దాం. ఆవేశం అనర్థాలకి దారితీస్తుంది. మీకు చెప్పతగ్గ వాణ్ణి కాదు. అయినా..." వేదరాయశర్మ వేడుకున్నాడు.

దేవరాయలు ఆవేశం తగ్గి ఆలోచనలో పడ్డాడు. మౌనంగా సింహాసనంపైన కూలబడ్డాడు. మహారాజులు మరణాన్నీ, అపజయాన్నీ సహిస్తారేమోకానీ అవమానాన్నీ, తిరస్కారాన్నీ సహించలేరు. అందునా విజయనగర సామ్రాజ్యాధినేతని ఒక పల్లెటూరి అమ్మాయి కాదనడం భరించలేకపోతున్నాడు.

ఇంతలో ద్వారం వద్ద అలికిడి వినిపించి అటుగా చూసారు. సన్నని దీపకాంతిలో ముఖాన్ని పోల్చుకోవడం కష్టమయ్యింది.

"ఎవరక్కడ?" దేవరాయలు హుంకరించాడు.

"నేను బావగారూ!" అన్న గొంతు వినిపించింది. ఆ వచ్చినతను నరేంద్ర గజపతి.

హఠాత్తుగా ఆంతరంగిక మందిరం వద్ద ప్రత్యక్షమవ్వడం చూసి ఆశ్చర్యపోయాడు దేవరాయలు.

"ఏం నరేంద్ర గజపతీ? ఇటుగా వచ్చారు?" సాధారణంగా ఆంతరంగిక మందిరంలోకి అతి తక్కువమందికే ప్రవేశం ఉంటుంది.

వేదరాయశర్మని మహారాజు రమ్మనమని పంపిన కబురు వేగుల ద్వారా తెలిసుకున్నాడు నరేంద్ర గజపతి. ఏం జరుగుతుందాని తనే రంగ ప్రవేశం చేసాడు. వారిద్దరి సంభాషణా పూర్తిగా తలుపుచాటునుండే విన్నాడు. విషయం అర్థమయ్యింది. మామూలుగా అయితే అతను లోపలకి వచ్చి వుండేవాడు కాదు. కానీ మహారాజు ఆవేశం చూసాడు. ఇదే అదననుకొని ప్రవేశించాడు. అతను రాజు కాకపోయినా రాజకీయం తెలుసు. కొత్త పాచిక వేయడానికే లోపలికి ప్రవేశించాడు.

"మా అక్కగారు మిమ్మల్ని మందిరానికి రమ్మనమని నాచే కబురంపారు. ఉదయం నుండీ శిరోభారం చేత బాధపడుతోంది. ఆమె బాధ చూళ్ళేక నేనే మీ కోసం వచ్చాను. మీరొస్తే తగ్గుతుందేమోనన్న ఆశ." మెల్లగా అని, అక్కడే ఉన్న వేదరాయశర్మని చూస్తూ ఆశ్చర్యం ప్రకటించాడు.

"వేదరాయశర్మ గారూ! మీరింకా ముద్గల్ వెళ్ళలేదా?" అంటూ ఏమీ తెలియనట్లు ప్రశ్నించాడు.

"మా మనసు బాగో లేదు. తరువాత వస్తామని చెప్పండి." విసురుగా అన్నాడు దేవరాయలు.

"మనసు బాగో లేదా? ఏమయ్యింది మహారాజా?" అమాయకంగా అడిగాడు.

దేవరాయలు జవాబివ్వలేదు. వేదరాయశర్మే జరిగింది చెప్పాడు.

"ఎంత పొగరు? సాక్షాత్తూ విజయనగర సామ్రాజ్యాధినేతనే కాదనడానికెన్ని గుండెలు? మహారాజా! మీరనుమతివ్వండి. ఇప్పుడే వెళ్ళి ఆ అమ్మాయిని బంధించి మీ కాళ్ళమీద పడేస్తాను. ఇది మీపై తిరస్కారం కాదు. యావత్తు విజయనగరానికీ అవమానం! ఇదే మా కళింగ దేశంలో అయితే రెక్కలు విరిచి లాక్కొస్తారు. మహారాజు మాటంటే వేదం. కాదంటే వెళ్ళేది కాటికే!" తెచ్చి పెట్టుకున్న ఆవేశంతో కోపం నటిస్తూ అన్నాడు.

మహారాజుకి నరేంద్ర గజపతి మాటలు బుర్రకెక్కాయి. అతని మాటల్ని సమర్థించాడు దేవరాయలు.

"వేదరాయశర్మ గారూ! ఇది మా ప్రతిష్ఠకి సంబంధించిన వ్యవహారం! ఒక అమ్మాయితో వివాహం ప్రశ్న కాదిక్కడ. మా మాటకి జరిగిన అవమానం. ఇది చూసి అందరూ ఫక్కున నవ్వుతారు. రాజ్యమంతా తెలిస్తే మా పరువేంగాను? తలెత్తుకు తిరగ గలమా? ఒక అమ్మాయే తిరస్కరిస్తే మొత్తం రాజ్యమూ ఎదురు తిరుగుతుంది. ఇది ఒక వ్యక్తికి సంబంధించిన విషయం కాదు. రాజుకీ, రాజ్యానికీ సంబంధించిన విషయం. నరేంద్ర గజపతి చెప్పింది సబబే!" అంటూ బావమరిదిని మెచ్చుకున్నాడు.

వేదరాయశర్మ ఏమీ మాట్లాడ లేదు. నోట మాట రావడం లేదు. అటు మహారాజునీ కాదనలేడు. ఇటు నేహాలవైపూ మాట్లాడ లేడు. తన తొందరపాటు ఒక అమ్మాయి జీవితాన్ని బలిచేస్తోందని బాధపడ్డాడు. మహారాజు తీరు చూస్తే ఆవేశంలో ఆమెను చంపేస్తారేమో నన్న భయం కలిగింది. ప్రస్తుతం నేహాల క్షేమమే అతనికి ముఖ్యం.

కొంతసేపు ఆలోచించి మెల్లగా అన్నాడు.

"పోనీ ఒక పని చెయ్యండి. మీరే స్వయంగా వెళ్ళి నేహాలతో మాట్లాడండి. అప్పుడు మిమ్మల్ని కాదనదు. అదొక్కటే సవ్యమైనదని తోస్తోంది నాకు."

"మహారాజు వెళ్ళడమా! ఏ రాజ వంశ చరిత్రలోనూ వినెరగం. అంతకంటే అవమానం మరొకటుండదు. మహారాజా! మీరనుమతివ్వండి. నేను వెళ్ళి ఈ పని చక్కదిద్దుకొస్తాను. ఆ అమ్మాయిని తీసుకొచ్చి మీ పాదాక్రాంతురాల్ని చేయిస్తాను." అంటూ ఆ- వేశంగా అన్నాడు నరేంద్ర గజపతి.

"మీరెందుకు నరేంద్ర గజపతి గారూ! నేనే వెళ్ళి మరోసారి చెప్పి చూస్తాను. ఎలాగైనా ఒప్పించి తీసుకొస్తాను. నా మాట నమ్మండి." వేదరాయశర్మ బ్రతిమాలాడు.

"ఇంకా ఒప్పించడమేమిటి మహారాజా? ఈ విషయం పదిమందికీ పొక్కక ముందే ఆ అమ్మాయినిక్కడకి తీసుకురావాలి. వేదరాయశర్మ గారూ! ఇది మీతో అయ్యే వ్యవహారం కాదు. నేను వెళ్ళి మహారాజు పంపారని చెప్పి స్వయంగా తీసుకొస్తాను." నరేంద్ర గజపతి అవకాశాన్ని జారవిడుచుకో దల్చుకోలేదు.

దేవరాయలు బావమరిది మాటలకి వత్తాసు పలికాడు. అధికారం ముందు పెద్దరికం తలవంచింది. ఎవరికీ తెలియకుండా తను ముద్గల్ వెళ్ళి ఆ అమ్మాయిని తీసుకొస్తానని మహారాజుని ఒప్పించాడు. దేవరాయలు బావమరిది మాటలు నమ్మాడు. సరే నన్నాడు.

వేదరాయశర్మ ఎవరికీ హాని చెయ్యనని మాట మాత్రం తీసుకున్నాడు. మహారాజు అందుకు ఒప్పుకున్నాడు.

మర్నాడే కొంతమంది సైనికుల్ని తోడు తీసుకుని బయల్దేరుతానని చెప్పాడు నరేంద్ర గజపతి. తన ప్రయాణ సన్నాహాలకై అక్కడనుండి వేంటనే నిష్క్రమించాడు.

ముద్గల్ వెళ్ళలన్నదొక్కటే తప్ప, అమ్మాయి పేరేమిటీ? ఎక్కడుంటుందీ? వంటి వివరాలేమీ తెలుసుకోకుండానే బయల్దేరాడు.

అదే అతను చేసిన పెద్ద తప్పు! వేశపు పొరల క్రింద పొరపాట్లు నక్కి నక్కి దాక్కుంటాయి. ఎప్పుడు ఏ ఉపద్రవనికి దారితీస్తాయో ఎవరూ ఊహించలేరు.

*000000000000*

అక్కడనుండి సరాసరి ఉమాదేవి మందిరానికి వెళ్ళాడు నరేంద్రగజపతి. జరిగింది చెప్పాడు. మహారాజు మందిరానికి వచ్చే వేళకి శిరోభారం వచ్చినట్లు నటించమని అక్కగారికి సెలవిచ్చాడు. తన ముద్గల్ ప్రయాణం సంగతి చెప్పాడు. అది విని ఒంటికాలి మీద లేచింది ఉమాదేవి.

"నీకేమయినా పిచ్చెక్కిందా? తోబుట్టువయ్యుండి స్వయంగా సవతిని తీసుకొస్తావా? ఛీ! ఎవర్ని నమ్మాలో నమ్మకూడదో తెలియడం లేదు." ఏడుపందుకుంది ఉమాదేవి.

"నీదొక మట్టి బుర్ర! నే వెళ్ళేది నీకు సవతిని తీసుకురావడానిక్కాదు. ఇందులో చాలా మర్మం ఉంది. ఆ అమ్మాయి విజయనగరంలోకి అడుగుపెట్టదు. నాతో పాటు మూడొందలమంది సైన్యాన్ని తీసుకెళతాను. ఈ విషయం మహారాజుకి తెలియనివ్వకు. ఒకే దెబ్బకి రెండు పిట్టలు. మహారాజు పెళ్ళి ఆపడం. ఆ అమ్మాయిని పై లోకాలకి పంపడం. అందుకే నేను వెళుతున్నాను. మరెవరు

వెళ్ళినా  అమ్మాయిని బంధించి తీసుకొస్తారు. అప్పుడు నువ్వేమీ చెయ్యలేవు. అసలు ఆ అమ్మాయి సజీవంగా లేకపోతే..? నీకు సవతి వచ్చే ప్రశ్నే లేదు.." తన ఆంతరంగాన్ని బయట పెట్టాడు నరేంద్రగజపతి.

తమ్ముడి ఆంతర్యం తెలిసి కుదుటపడింది ఉమాదేవి. మహారాజు వస్తే ఏమాత్రం గొడవ పెట్టవద్దనీ, ఆయన్నే సమర్థిస్తూ మాట్లడమనీ ఒకటికి వందసార్లు హెచ్చరించాడు నరేంద్ర గజపతి.

మహారాజు వచ్చే వేళయ్యిందని తన మందిరానికి బయల్దేరాడు.

*000000*

ఇక్కడ వేదరాయశర్మ తన విడిదికి తిరిగొచ్చాడు. ఏం జరుగుతోందో అంతుపట్టడం లేదు. ఒకటి తలుస్తే మరొకటి జరుగుతోంది. శంభుడికి జరిగినదంతా చెప్పాడు. శంభుడూ  రాత్రి నిద్రపోలేదు. ఎలా మొదలయ్యి ఎవరి మెడకు చుట్టుకుంటూందేమోనన్న భయం రాత్రంతా ఆవరించుకుంది. వేదరాయశర్మకీ నిద్రలేదు.

దీనంతటికీ కారణం తననే ఒకటికి పదిసార్లు నిందించుకున్నాడు. నేహలకేదయినా జరిగితే  పాపం తనదే! దీనికెవరూ బాధ్యులుకారని బాధపడ్డాడు. తను చేసిన చిన్న పొరపాటు మరొకరి జీవితాన్ని శాస్తోందని విలపించాడు.

బాధతోనూ, కన్నీళ్ళతోనూ జీవితాలు చక్కబడవు. దీనికి మహరాజులకీ మినహాయింపు లేదు.

మాహా ప్రళయం వచ్చే ముందు నిశ్శబ్దంలా ఆ రాత్రి భారంగా గడిచింది.

*0000000000*

(కొనసాగింపు వచ్చేసంచికలో)

ఈ నవల క్రిందటి భాగాలు ఇంకా చదవలేదా..? లేక మళ్ళీ ఒకసారి చదువుదామనుకుంటున్నారా? వెంటనే కౌముది గ్రంధాలయాన్ని సందర్శించండి..




**Click here to go to KOUMUDI Library**

**Click here to share your comments on this serial**